# ఉగాది కానుక

## దర్భా వెంకటరత్నం

గడియారం ఠంగుమని 6 గంటలు కొట్టింది. కృష్ణ లేచి, బద్ధకంగా ఆవులించి, మంచంమీద వత్తిగిలి పడుకున్నాడు. వంట గదిలోనుండి కాఫీవాసన కృష్ణ నాసికారంధ్రాలలో ప్రవేశిస్తోంది. ఇంతలోకే అతని భార్యచీర కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి, "అబ్బబ్బ! ఇంకా ఏమిటండీ ఆ మొద్దు నిద్ర. ఆరయింది. లేవండి" అంది. "ఊఁ!" అని బద్ధకంగా కళ్ళు విరుచుకొని కృష్ణ మంచంమీద లేచి కూర్చున్నాడు.

"ఓహో! దొరగారికి బ్రష్ అందించాలి లాఉంది" అంటూ శారద బ్రష్, పేస్టూ తెచ్చింది. కృష్ణ అవి అందుకొని, బద్ధకంగా మంచం దిగి పెరట్లోకి నడిచాడు. పెరట్లో ఉన్న చెట్లమీదనుండి వీస్తున్న చల్లని పిల్లగాలి కొద్దిగా చలి కల్గిస్తోంది. పాకలో కట్టిన ఆవుదూడ, దూరంగా కట్టిన తల్లి కోసం గొంతులు చేస్తోంది.

రాత్రి కలలో ఆఫీసరు తనను మెచ్చుకోడం......సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటూ కృష్ణ పళ్ళు తోముకోడం మొదలుపెట్టేడు. పూర్తవగానే, ఎదురుగా శారద తువ్వాలు పట్టుకొని నిలబడింది. కృష్ణ తువ్వాలందుకొని ముఖం తుడుచుకుంటూ, శారద వెనకాల వంటయింట్లోకి నడిచేడు.

శారద యిచ్చిన కాఫీగ్లాసు పట్టుకొని రేడియోగదిలోకి వెళ్లేడు. కరాచీనుండి లతా ఆలాపిస్తున్న మధురగీతాన్ని వింటూ కుర్చీలో చేర్లబడి నెమ్మదిగా కాఫీ త్రాగుతూండగా,

"ఏమండోయ్!" అని అవతలి గదిలోంచి శారదకేక వినబడింది. "కూరలు నిండుకున్నాయి. కొత్త బజారు వెడతారూ."

"తప్పుతుందా? సంచీ యిలా పడేయ్" పర్సు వేసుకుంటూ అన్నాడు. శారద కూరలసంచీతో వచ్చి కూరగాయల జాబితా మొదలుపెట్టింది. సరేనంటూ కృష్ణ వీధిగుమ్మంలోకి వచ్చాడు. ఇంతలోకే ఇంటిముందాగిన బండిలోంచి అతని తల్లి హనుమాయమ్మ, తలమీద ముసుగు సవరించుకుంటూ దిగింది.

"రావే! అమ్మా! రా!!" అని ఆహ్వానించి కృష్ణ ఇంట్లోకి చూసి "శారదా!" అని పిలిచాడు. శారద గబగబా వచ్చి, అత్తగారిని చూసి గతుక్కుమని అంతలోకే తమాయించుకొని "రండి! అత్తగారూ!" అంది. హనుమాయమ్మ తన చిన్న బట్టలమూటతో మెట్లెక్కి లోపలికి ప్రవేశించింది.

...కృష్ణ వాళ్ళ నాన్నగారికి ఒకడే కొడుకవడం మూలాన్ని గారాబంగా పెరిగాడు. కాని దురదృష్టవశాత్తు కృష్ణ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. వాళ్ళు పెద్ద స్థితిపరులు కాకపోయినప్పటికీ ఒక పది ఎకరాల మాగాణీ పూర్వార్జితం వుంది. కృష్ణకు ఒక అక్కయ్య ఉంది. ఆమెను వెంటూరులో మంచి ఆస్తివున్న సంబంధం చూసి వైభవంగా పెళ్లిచేశారు. కాని ఆమె వైవాహికజీవితం సుఖవంతంగాలేదు. ఆమె మంకుతనం మూలంగాను, భర్త పట్టింపు మూలాన్ని తరచు వారి మధ్య పోట్లాటలు వచ్చేవి. తన అక్కయ్య కాపురంగురించి ఆలోచించినపుడల్లా కృష్ణకు శారద మంచితనం స్ఫురిస్తూంటుంది. కాని ఆ మాటను ఎన్నడూ శారద ముందు తేలలేదు. కాని అతను అభిమానం మాత్రం అమితంగా చూపెడతాడు శారద ఎడ. ఇక హనుమాయమ్మ తనకూతురు కాపురం తలచుకొని ఎప్పుడూ బాధపడుతూంటుంది. తన కొడుకు చూపే అమితమైన ఆదరణవల్ల శారద సుఖంగా వున్న కాపురం చూసి ఆమె అప్పుడప్పుడు అసూయపడడం కూడా కద్దు. ఆమె మన సత్యభామలాంటిది. కృష్ణ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయినా, తన తండ్రి కూడా అప్పుడప్పుడు తన తల్లిని గట్టిగా దండించేవాడని మిగిలినవాళ్లు చెప్పగా విన్నాడు. కృష్ణ తండ్రి వర్లటూరులో ఉండటం మూలాన్ని, అతనుతన హైస్కూలు చదువుకు పట్టణంలో వున్న మేనత్తదగ్గర ఉండవలసి వచ్చింది. అందుచేత అతనికి ఎప్పుడూ తన తల్లిదగ్గరకంటే తన మేనత్త దగ్గర చనువెక్కువ. అతను బి. ఎ. పూర్తిచేసి పెద్దాపురం తాలూకా ఆఫీసులో చేరేడు. ఉద్యోగంలో చేరిన సంవత్సరానికి తల్లి బలవంతంమీద, తెనాలి నారాయణగారి పెద్ద అమ్మాయి శారదను వివాహం చేసుకొన్నాడు. నారాయణగారు 15 ఎకరాల ఆస్తిపరుడు. శారద పెద్దకూతురు అవడం మూలాన్ని అతి వైభవంగా వివాహం చేసేడు. తరువాత ప్రతీపండుగకు కృష్ణ అత్తవారింట్లో చలాకీమరదలు ఉషతోను, బావమరిది రామంతోనుహుషారుగా గడిపేవాడు. క్రిందటిసారిపండుగకు మామగారు వాచీ బహుమతి యివ్వబోగా కృష్ణ నిరాకరించి, శారదచేత వచ్చేసారికి ఏకంగా "రేడియో" యిమ్మని చెప్పించాడు. ఆ విషయంమీద శారద, కృష్ణను యింకా దెప్పుతూనే ఉంటుంది, "యింకా యిచ్చే మామగారుంటే రేడియో ఏం ఖర్మ కారు కొనిమ్మంటారు మీరు" అని. కృష్ణ నవ్వి ఊరుకొనేవాడు. వారి ఈ అన్యోన్యత గుర్తించే హనుమాయమ్మ అప్పుడప్పుడు కృష్ణతో రహస్యంగా "శారదకు అంత అభిమానం పెట్టడం మంచిదికాదురా, వాళ్ళు లోకువకడతారు"అనేది. కాని కృష్ణ వాటిని చెడచెవిని పెట్టేడు. కారణం, తన మామగారి ప్రవర్తన అలాంటి అనుమానాలకెన్నడూ చోటివ్వలేదు. కాని, శారద మాత్రం, హనుమాయమ్మగారు గుమ్మంలోకి అడుగుపెట్టేరంటే చాలా భయపడుతుంది...

కృష్ణ హనుమాయమ్మను యింట్లోకి తీసుకొచ్చాడు. ఆమె ఉస్సూరంటూ కుర్చీలో కూలబడింది.

"కోడలా! ఏది కాఫీ, యిలా..." మాట పూర్తిగా నోటినుండి రాకముందే శారద కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమయింది.

"ఏమే! అమ్మా! వెంటూరు నుంచేనేమిటి రావడం" అడిగాడు కృష్ణ.

"అవునురా నాయనా! రాలేక రాలేక దానిని వదిలి వచ్చాననుకో! దాని సంసారం చూస్తోంటే కడుపు తరుగుకుపోతోంది. దాని ఖర్మేమిటో కాని అది ఏం మాట్లాడినా మీ బావకు కోపం వస్తుందిరా! ప్రతిరోజూ వాళ్ళు ఏదో ఒక విషయం మీద దెబ్బలాడుకోడమే! అక్కడ శాంతి, లేదురా నాయనా!"

"అంతేనమ్మా! ఏమిటో కొందరి జీవితాలు మనం బాగు చేయలేము. బావ తెలియనివాడా! అక్క జ్ఞానంలేనిదా! వాళ్ళంతట వాళ్లే ఏదో ఒకనాడు అది గుర్తించాలి కాని మనమేం చెయ్యగలం" అన్నాడు కృష్ణ వేదాంత ధోరణిలో.

"అంతేరా నాయనా!" హనుమాయమ్మ లేచి వంటయింట్లోకి దారితీసింది.

*           *           *

మూడురోజుల తరువాత, కృష్ణ ఆఫీసుకు పోయేముందు తొమ్మిది గంటలకు భోజనం ముందు కూర్చున్నాడు.

శారద బయటుండడం మూలాన్ని, హనుమాయమ్మగారు కృష్ణ ప్రక్కన కూర్చుని, విసవకర్రతో విసురుతూ అన్నం వడ్డిస్తోంది.

"ఏరా కృష్ణా నిన్న మీ మామగారి దగ్గర నుంచి వుత్తరం వచ్చిం దనుకుంటాను. ఏమి రాశాడో చెప్పొచ్చా నాకు" అంది ఎత్తి పొడిచే ధోరణిలో.

"అదేమిటమ్మా! బావుంది! చెప్పక పోవ డానికి ఏ ముందని ఆ వుత్తరంలో. ఉభయ కుశలోపరి."

"అంతేనట్రా! మరేమిటో అనుకున్నాలే! ఈమధ్య ఏదో మీ మామగారి గురించి కొన్ని విషయాలు తెలిశాయిలే."

"అదేమిటది! సూటిగా మాట్లాడకూడదూ! ఆ దాపరికం ఎందుకు?"

"ఆఁ! నువ్వో వెర్రిమొహానివి! యింతకీ ఆ వుత్తరంలో ఏ ముందో చెప్పావు కాదు."

"నువ్వు చెప్పని స్తేగా! క్రిందటి పండుగకి మా మామగారిచ్చిన వాచీ తీసుకోకుండా ఈ ఉగాదికి ఏకంగా రేడియో కొనిమ్మన్నాను కాదూ! దాన్ని గురించి."

"ఏమన్నా డేమిటి?"

"డబ్బు సర్దుబాటు లేదుట. పండగ తరువాత రెండు నెలల్లో సర్దుతానని."

"ఆఁ! నేను అనుకున్నాను! అను కున్నాను నాయనా! అనుకున్నంతా అయింది."

"ఏమిటే అది! చెప్పకూడదూ తిన్నగా" విసుక్కుగా అన్నాడు కృష్ణ.

"నా కెందుకురా నాయనా! అనవ సరంగా మీకు మీకు స్పర్థలు. వెధవడబ్బు యివాళ కాకపోతే మరో రోజు వస్తుంది."

"అదే వద్దంటా! చెప్పమన్నానా!" కోపంగా అన్నాడు కృష్ణ.

"ఆఁ! ఏముంది! మొన్న మీ బావ మేనత్త కొడుకు లేడూ! శంకర్రావని! ఆమధ్య పెళ్లాం విడాకులిచ్చేసింది. అతను పనిమీద తెనాలి వెళ్ళి మీ అత్తారింటికెళ్లాడు ఏదోవిషయమై! అతనితో మీ మామగారు మాటలసందర్భంలో అన్నాడుట 'మా అల్లుడు రేడియో కోరేడండీ ఈ సారికి. అలుడు పాతబడినా ఈ బాధ తప్పడం లేదండీ' అని. అదే! నువ్వు చెప్పావుగాగు ఏదో డబ్బుసర్దుబాటు లేదని, ఆచిరాకుమీద అని ఉంటాడు! పాపం" అంటించింది చల్లగా హనుమాయమ్మ.

"వాళ్ళలాంటి చిరాకులుంటే మనకే చెప్పకూడదూ! మళ్ళా ఎవడో పరాయివాడి దగ్గ రెందుకూ ఆ వాగుడు."

"బావుందిరోయ్! మన మొహంమీద అంటాడేమిటి. అయినా రెండు నెలల్లో సర్దుబాటు చేస్తానన్నాడుగా! అదీ మాద్దు గాని! అంతేగాని వెధవడబ్బుకోసం అనవ సరంగా నువ్వూ శారదా మాటా మాట అనుకోకండి. పెద్దదాన్ని చెపుతున్నాను. ఏదో మాట అన్నాడని చెప్పకోడంగాని యిప్పుడవన్నీ పెట్టుకొని కాపురాలు పాడు చేసుకోమనేమిటి" అని కంచంలోకి చూసి "అడిగవేంరా! కొదిగా పచ్చడి వేయ మన్నావా" అని పచ్చడివేసి వెళ్ళి చేయికా కొ్్ని ముళ్ళా వచ్చి కూర్చొంది. క -

మౌనంగా భోజనంముగించి లేచి చేయి కడు క్కొన్నాడు. కోడువేసుకొని ఆఫీసుకి వెళ్ళ బోతుంటే మళ్ళీ హనుమాయమ్మగారు అను నయించింది-"ఒరే! కృష్ణా! ఈ విషయా లేం పట్టుకు మనస్సు పాడుచేసుకోకు. అసలే నువ్వభిమానవంతుడివి."

కృష్ణ మెట్లుదిగగానే ఆవిడ తలుపేసు కొని, వంటింట్లో కడుతూ శారదవున్న గదిలోకి తొంగిచూసి, ఆమె మొహం పరిశీ లిస్తూ అడిగింది.

"ఏమే! నీకూ అన్నం పెట్టెయ్య మంటావా!"

"ఫరవాలేదు లెండి! మీరు తినేసినతరు



# ఉగాది కానుక

వాత నాకు పెట్టొచ్చు! నాకంత ఆకలిగా లేదు" అంది శారద, చిరునవ్వుతో.

"అలాగే నమ్మా! ఇప్పుడు సరదాగానే అంటావు! మళ్లీ వాడొచ్చాక, నీ అమ్మ నాకు తిండెట్టలేదని చెప్పి పెడుదువుగాని" —నవ్వుతో హనుమాయమ్మ మాట్లాడినా, వాటి అర్థం శారదకు బాగా తెలుసు. అందుచేతనే చిన్నబుచ్చుకొని, ముఖం దించుకొంది.

కృష్ణ ఆఫీసులో పనిచేస్తున్నా మనస్సు మాత్రం తల్లి చెప్పిన విషయంమీదే వుంది. అతను ఏ నిర్ణయానికీ రాలేకపోతున్నాడు. తన మామగారు అలాఅనిఉండకపోవచ్చేమో! ఐతే తనతల్లికి, ముఖ్యంగా శంకర్రావుకీ అలా చెప్పవలసిన అవసరం ఏమిటి? లేకపోతే శంకర్రావు చెప్పకపోయినా తన తల్లి............ ఐనా. ఏమో!...... తన మామగారు, అమ్మ అన్నట్టు డబ్బులేని చిరాకులో అన్నాడేమో! ఏంతయితే మాత్రం పరాయివాడిదగ్గర తన సొందుకించపరచాలి. యివ్వలేకపోతే తనదగ్గరే చెప్పొచ్చుగా! ఎలా చూసినా, ఎంత కాదనుకున్నా మామగారి మీదకే అనుమానం పరిగెడుతోంది. కృష్ణ తనకు రేడియో కొనకపోయినా అంతగా పట్టించుకొనే రకం కాదు, కాని తనను తేలికగా మాట్లాడితే మాత్రం ఎవరినైనా సరే అతడు సహించలేడు. తన మామగారు ఎంత మంచివాడైనా అలా మాట్లాడడానికి ఆస్కారం లేకపోలేదు. ఏమైనా సరే దీనిలో నిజానిజాలేమిటో తేల్చాలి. యిలా ఆలోచనలతో అతనిబుర్ర వేడెక్కిపోతోంది.

అతనిప్రక్కన పనిచేస్తున్న సుబ్బారావు, కృష్ణకేసి చూసి "ఏమిటోయ్ కృష్ణా! తెగ ఆలోచిం చేస్తున్నావు! బుర్ర పగిలిపోతుంది! జాగ్రత్త!" అని నవ్వుతూ తన ఫైళ్లలో మునిగిపోయాడు. కృష్ణలేచి ఫైళ్ళన్నిటిని ముందుకుతోసి ఆఫీసుకు లీవులెటరు వ్రాసి, ప్యూనుకిచ్చి, యింటికి బయలుదేరాడు.

* * *

మూడువారాల తరువాత ఒకరోజున హనుమాయమ్మ మళ్లీ వెంటూరుకు బయలుదేరింది.

ఇక ఉగాది అయిదురోజులు మాత్రమే ఉంది. శారద తన తండ్రి దగ్గరనుండి, పండుగకు రమ్మని ఉత్తరం యింకా రాలేదేమా అని కలవరపడుతోంది. ప్రతి సారీ పండుగకు మామగారు కృష్ణకు పండుగ 10 రోజులుండగానే ఆహ్వానం పంపేవాడు. కృష్ణకు ఈవిషయం కలవరం కలిగించింది. ఇంకా ఉత్తరం రాకపోవడం చూస్తే అమ్మ చెప్పిన విషయం నిజమేనేమో అనిపిస్తోంది కృష్ణకు. ఈవిషయాన్ని శారదకు తెలియ పరచకుండా మనస్సులోనే పెట్టుకొని బాధపడే మనస్తత్వం కాదు అతనిది. అందుచేతనే అతను, మామగారు తనఎడల అసహ్యకరంగా ప్రవర్తించేడని, చాలాసార్లు శారదముందు తన బాధ వెళ్ళగ్రక్కకుండా మనుకోడం కాని తీరా చెప్పవలసివచ్చేసరికి "ఏమో! కేవలం అనుమానంమీద ఆధారపడి, మాటలు మీరడం మంచిదికాదు, దాని నిజానిజాలు తెలియండే, దానిని గురించి శారదముందు ప్రస్తావించి, ఆమె మనస్సు పాడు చేయకూడదు" అనుకొని ఆ ప్రయత్నం విరమించుకోడం జరుగుతోంది.

హనుమాయమ్మగారు వచ్చి వెళ్ళిన దగ్గర నుంచీ, భర్త విచిత్రప్రవర్తన చూస్తే శారదకు చాలా ఆశ్చర్యం కలుగుతోంది. కృష్ణ ఏదో విషయాన్ని మనస్సులో పెట్టుకొని బాధపడుతున్నాడని గ్రహించింది శారద. కాని అతనిని బాధపెడుతున్న ఆ విషయమేదో గ్రహించలేకపోయిందామె. ఇదివరకు కొన్ని సందర్భాలలో భర్త తన ఆఫీసువిషయాల్లో బాధపడిన సమయాలింకా శారదకు జ్ఞాపకంఉన్నాయి. ఆమె అతనికి అనేకక్లిష్ట సమస్యలతో బుర్ర బద్దలుచేసుకుంటుంటే సహాయపడి వాటిని భేదించడానికి దోహదమిచ్చేది. కాని ఈసారి కృష్ణ తన హృదయంలోని బాధను శారదవద్ద చెప్పలేకపోతున్నాడు! ఎందుచేత? ప్రమాదవశాత్తు అది తన పుట్టింటివారిమూలాన్నా? ఆ ప్రశ్న తలచుకొంటే శారద కంపించిపోయింది. కాని తన వివాహమయినతరువాత తనభర్తకు అత్తవారింట్లో ఎలాంటిలోపమూ జరుగలేదు. పైపెచ్చు అతను అడగకపోయినా ప్రతిపండుగకు కానుకగానో, నగదుగానో బహుమతి యిస్తున్నారు. అయినా, అలాంటి కానుకలో లోపంచేసినా బాధపడే మనస్తత్వంగాదు తనభర్తది. మరిఎందుకీబాధ!!! ఎటూతేలని ఈ సమస్యలతో శారద నిట్టూర్చుతూ, కూర్చున్న సోఫాలో వెనక్కు జారబడింది. గోడగడియారం 7 గంటలు కొట్టింది. యింకా భర్త ఆఫీసునుండి రాలేదు. 7 గంటలవరకు ఓవర్ వర్క్ ఉంటుందా! ఆలోచిస్తూంటే వీధి తలుపు తట్టిన చప్పుడైంది. శారద గబగబా లేచి వెళ్ళి తలుపు తీసింది. కృష్ణ నీరసంగాఉన్న ముఖంతో, ముఖమ్మీదపడుతున్న ముంగురులను పైకి త్రోసుకొంటూ, నిశ్శబ్దంగా లోపలికి నడిచాడు. కృష్ణ తనగదిలోకి వెళ్లాడు. శారద గబగబా వంటింట్లోకివెళ్లి ఫ్లాస్కులో కాఫీ, గ్లాసులోపోసి భర్త దగ్గరకు వచ్చింది. కృష్ణ చేతులు, నుదుటిమీద పెట్టుకొని కళ్ళు మూసుకొని పడకుర్చీలో పడుకొని ఉన్నాడు. శారద దగ్గరకువెళ్లి కాఫీ పక్కనున్న బల్లమీద పెట్టింది. గుండెలమీద చెయ్యివేసి చూస్తే జ్వరంతో ఒళ్ళు కాగిపోతోంది. శారద ఆందోళనతో "యిదేమిటండీ! ఇలా జ్వరం కాలిపోతుంటే యింత సేపూ యెక్కడ తిరుగుతున్నారు" అంది.

కృష్ణ ఒకసారి కన్నులు తెరిచి శారద వైపుచూసి మరలకన్నులు మూసుకున్నాడు. అతని ముఖంలో ఎలాంటి భావాన్నీ శారద గ్రహించలేకపోయింది. కృష్ణలో చెలరేగుతున్న అంతర్యుద్ధం గురించి ఆమెకేం తెలుసు. ఆఫీసునుండి తిరిగివస్తుంటే తనమిత్రుడు మాటల సందర్భంలో తన మామగారి యిల్లు, మామగారి మంచితనం గురించి చెపుతూంటే మరిచిపోదామనుకుంటున్న కృష్ణకు మళ్ళీ మామగారి సంగతి మనస్సులో చెలరేగింది. మానబోతున్న గాయానికి తొక్కరేగింది. యిప్పుడు గాయం తగిలినప్పటికంటే ఎక్కువ బాధ. మళ్ళీ పాతసంగతులు గుర్తుకొచ్చాయి. పార్కులోకి దారితీశాడు కృష్ణ. చీకటిపడేవరకు అక్కడో మూలనున్న సిమెంటు బెంచీమీద కూర్చుని, మనస్సంతా పాడు చేసుకున్నాడు కృష్ణ. కాని ఈసారి అతడొక నిర్ణయానికొచ్చేడు. ఏమైనాసరే ఈ

---

పిచ్చాసుపత్రి పక్కనే వంతెనమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న ఒకాయన దగ్గరకు ఇద్దరు పరుగెత్తుకుంటూ వచ్చారు. "ఒక 'పేషంటు' తప్పించుకు పోయాడు! ఇటువర యినా వెళ్ళడం చూశారా?" అని రొజుతూ అడిగాడు. "ఎలా ఉంటా"డని ఆయన అడిగాడు. "పొట్టిగా, బక్క పల్చగా ఉంటాడు, సుమారు రెండు వందల పౌన్లు బరువు ఉంటాడేమో" అన్నారు వారిద్దరూ. పొట్టిగా, బక్కపలచగా ఉంటే అంతబరువెలా ఉంటాడని ఆయనకు సందేహం కలిగింది. వారు విసుగుతో, "మొదటే చెప్పాముగా పిచ్చాసుపత్రి 'పేషంటు'ని జవాబిచ్చారు."

---

విషయం శారదకు తెలియజేయకూడదు. ఆమె మనస్సు బాధపెట్టకూడదు. భర్తసేవలోనే తనకు ఆనందం ఉందనే మనస్తత్వం గల శారదను, ఆమెకు ప్రమేయంలేని విషయంలో జొనిపి, ఆమె అమాయకమైన మనస్సును బాధపెట్టకూడదు అనుకున్నాడు.

కాని ఈ విషయం అమాయకమైన శారద హృదయానికెలా తెలుస్తుంది. ఆమె అలాగే భర్తకేసి చూస్తూ నిలబడిపోయింది. కొద్ది క్షణాలలో మళ్ళీ తేరుకొని "యిదిగో కాఫీ తీసుకోండి" అని భర్తచేతికి కాఫీగ్లాసు అందించి గబగబా లోపలికెళ్ళి కృష్ణకోసం మంచం సర్దింది. కృష్ణ నెమ్మదిగా లేచి వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు. శారద అలాగే మంచం ప్రక్కగా నిలబడి కృష్ణను విచారంతో చూస్తోంది. కృష్ణ ఆమెవంక కన్నార్పకుండా కొంచెంసేపు చూసి అన్నాడు: "శారదా! రెండువారాలనుండి నా ప్రవర్తన విచిత్రంగా ఉందేమిటి అనుకుంటున్నావుకదూ?"

శారద ఆ మాటకు త్రుళ్ళిపడింది. "అదేం మాటలండీ! మీరు ఏం విచిత్రంగా ప్రవర్తించారు? ఇలాంటి లేనిపోనివన్నీ పెట్టుకొని కూర్చోకండి! ఆగండి! మీకు జావ కాచి తెస్తాను" అని వస్తున్న కన్నీళ్ళను బలవంతంగా ఆపుకుంటూ చీరకొంగును నోటిలో కుక్కుకొని వంటింట్లోకి తొందరగా వెళ్ళిపోయింది. కృష్ణ ఆమె వెళ్ళినవైపే ఆర్ద్రనయనాలతో చూస్తూ, అలా కన్నులు మూసుకున్నాడు.

* * *

మర్నాడు ఆఫీసుకు సెలవు రాసి పంపేసి కృష్ణ పక్కమీదే పడుకుని ఇంగ్లీషు నవల చదువుకుంటున్నాడు. జ్వరం కొద్దిగా నిమ్మళించింది. ఇంతలో మార్నింగు పోస్టు వచ్చింది. పోస్టుమాన్ "సార్" అన్న కేకతో ఒక ఉత్తరం వచ్చి ముందుగదిలో పడింది. శారద వెళ్ళి ఉత్తరం తెచ్చింది. కృష్ణచేతిలో పెట్టి, ప్రక్కన నిలబడింది. అది తెనాలినుండి, నారాయణగారు రాసిన ఉత్తరం. దానిని కృష్ణ ఇలాగట్టిగా చదివేడు.

క్షేమం తెనాలి.
ది. 16-8-60.

ప్రియమైన కృష్ణకు నీ మామ నారాయణ ఆశీర్వదించి వ్రాయునది.

ఉభయ కుశలోపరి. ఉగాదికి నీవు చి॥ సౌ॥ శారదను తీసుకొని తప్పక రావలెను. క్రిందటిసారి నీవు వాచీ తీసుకోని కారణాన ఈసారికి అన్నీకలిపి ఒక రేడియోను ఆర్డరిచ్చాను. నీవు యిదివరలో డబ్బు సర్దుబాటు లేనట్లుగా రాసియున్నావు. కాని దైవానుగ్రహమువల్ల డబ్బు సమకూడినది. నీవు, అమ్మాయి పండుగకు వచ్చి యిక్కడ సంతోషముగా గడిపిన, నాకు అంతకంటె కావలసినదేమిటి. చి॥రాము, చి॥ సౌ॥ ఉష


టాటావారి
ఒడికొలోన్ మరియు
ఒడికొలోన్ సబ్బు

ముట్టుకుంటే
మంచుముద్ద



కీ ఉత్తరం రాస్తున్నంత సేపూ తొందరగా రమ్మని రాయమని ఒకటేగోల. అందుచేత, సాధ్యమైనంత త్వరలో, శారదను తీసుకొని పండగకు రావలెను.

ఇట్లు, ప్రియమైన
నారాయణ.

ఉత్తరం చదవడం ముగించి కృష్ణ పైతేదీ చూసి ఆశ్చర్యపోయేడు 16, మార్చి...... ఈ తేళ 28. యిదేమిటి యింతాలస్యం అయిందీ ఉత్తరంరావడం. తెనాలిలో వేసిన పోస్టుస్టాంపు చూసేడు. 22, మార్చి. యిప్పు డర్థమైంది కృష్ణకు. తనమామగారు వారం క్రిందటరాసిన ఉత్తరం, పోస్టుచేయడం లేటుచేసి వుంటారు. అయితే యిది మామ గారి తప్పు కాదన్నమాట. ఆ కొంటెరామం చేసుంటా డిదంతా.

శారద అంది! "మీకిలా జ్వరంగా ఉండే-టప్పుడు ఎలా వెడతాముపండగకు" ఈసారికి వీలు లేదని రాసేయండి. మా తమ్ముడిచేత పంపు తారు రేడియో ఏమ"న్నట్లు చూసింది కృష్ణ ముఖంలోకి ప్రశ్నార్థకంగా.

"పోనీ నువ్వెళ్ళకూడదూ! నే నిక్కడే వుంటాను" అన్నాడు కృష్ణ.

"మిమ్మల్ని యిలా వదిలా! బావుందండీ మీవరస" అని కార్డు కలం పట్టుకొచ్చి కృష్ణచేతికిచ్చింది. కృష్ణ వుత్తరం రాసి, యిలా చదివేడు గట్టిగా.

క్షేమం పెద్దాపురం,
ది 23-3-60.

## ఉగాది కానుక

గౌరవనీయులైన మామగారికి, అల్లుడు కృష్ణ నమస్కరించి వ్రాయునది.

మీరు వ్రాసిన ఉత్తరం అందింది. మీరు వ్రాసిన ప్రకారం పండుగకు రావడానికి నా కేలాంటి అభ్యంతరము లేదు. కాని, దుర దృష్టవశాత్తు నాకు నిన్నటినుండి జ్వరం తగిలింది. అదీ కాక, మాకు ఈ సారి సెలవల్లో కూడా ఆఫీస్ వర్కు ఉంది. అందుచేత జ్వరం తగ్గినా నేను రావడానికి వీలుపడదు. కనుక, మీ అమ్మాయిని పంపిద్దా మనుకుంటున్నాను. ఉష, రాముంలు మా కోసం వెయిట్ చేస్తున్నారేమో పాపం. మరోలా అనుకోవద్దు.

యిట్లు
ప్రియమైన
కృష్ణ.

శారద కళ్ళనీరుతో, "అదేమిటండీ మళ్ళీ అలా రాసేరు. నేను వెళ్ళనని చెప్పేనుగా" అంది.

"మీ నాన్నగారు వాళ్ళూ మనకోసం వెయిట్ చేస్తూంటారు. పాపం నువ్వే నా వెళ్ళాలి. తప్పదు" అన్నాడు కృష్ణ.

"మరి మీ ఆరోగ్యం" అంది శారద.

"ఈ జ్వరం ఎప్పుడూ ఉంటుందేమిటి? రేపటికి తగ్గిపోదూ."

శారద అయిష్టంగా సమ్మతించింది.

* * *

మూడోరోజున కృష్ణకు జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. ఆరోజే శారద పండుగ ప్రయాణం. కృష్ణ, శారదను సామర్లకోట స్టేషనుకు తీసుకెళ్ళి, 2-30 కు మద్రాసు మెయిలుఎక్కించేడు. శారద రైలుపెట్టెలో, కిటికీదగ్గర కూర్చుంది. కృష్ణ ప్లాటు ఫారంమీదనిలబడి దిక్కులు చూస్తున్నాడు. వాళ్ళిద్దరూ మాట్లాడకుండా అలాగే నిల బడారు చాలాసేపు. శారద గుడ్లనీరుకక్కు కోని ఎవరూ చూడకుండా చీరకొంగుతో తుడుచుకొంటోంది. పండగకు వెడుతు న్నట్లు, ఆనందఛాయలు ఆమె ముఖంలో శూన్యమయ్యాయి. భర్త తోడులేంటే పండుగ, సంతోష విహీనమనే భావం ఆమెది. కృష్ణ అయోమయంగా శూన్యం లోకి చూస్తూ నిలబడిపోయాడు. ఏవో భావాలు అతని మెదడులో చెలరేగుతున్నాయి. ఇంతలోకే రైలుయింజను కూతకూసింది సిగ్నలు చూసి. గార్డు విజిలువేసి పచ్చజెండా చూపించేడు. రైలు మరొకసారి కూతకూసి బయలుదేరింది. "ఏమండీ" శారద పిలుపుతో కృష్ణ మళ్ళీ ఈలోకంలోకి వచ్చాడు.

"జాగ్రత్తగా వెళ్ళు! నేను రాలేదని, ఏమీ అనకోవద్దని చెప్పు మీ..." యింకమాటాడ





# ఉచితము

ఇప్పుడు ప్రతి గ్రైమిక్స్ సీసాతోను ఒక ఆకర్షణీయమైన డెంటా మీకు ఉచితముగా లభించును. గ్రైమిక్స్ గ్రైప్ మిక్స్చర్ కడుపు బిగదీయుట, ఉద్బరము, నొప్పి లేనుండి మీ బిడ్డకు శీఘ్రముగా తప్పక స్వస్థత చేకూర్చును. దంతములు వచ్చు నప్పుడు, తల్లి పాలు మాన్పునప్పుడు కూడా గ్రైమిక్స్ మీ బిడ్డను ఆహ్లాదముగాను, ఆరోగ్యముగాను ఉంచును. గనుక మీ బిడ్డకు శ్రేష్ఠమైన గ్రైమిక్స్ వాడండి.

## గ్రైమిక్స్




(ఇది బర్నాల్, ఫినాక్స్
తయారుచేయు]
Boots
బ్యూట్సు వారిది.)

లేక పోయేడు కృష్ణ. గొంతుక పూడుక పోయింది. మాట రాలేదు. అలాగే చూస్తూ కదులుతున్న రైలులోంచి ఊగుతున్న శారద చేతికి, సరిగా తనచేతిని ఊపుతూ రైలు కను మరుగై పోయేవరకూ అలాగే చూసేడు. రైలు దృష్టిని దాటి వెళ్లిపోయింది. కృష్ణ యింటికి కదిలేడు. అతనిమనస్సు మనస్సులో లేదు. అంతా అయోమయంగా ఉంది.

ఆరాత్రి అతనికి నిద్రపట్టలేదు. శారదను అన్యాయం చేస్తున్నానేమోనని బాధపడ్డాడు కొంతసేపు. తన మామగారిపై తనిప్పుడేర్పరచుకొన్న అభిప్రాయం ఆధారాలులేని అబద్ధాలపుట్టలా కనిపిస్తోంది కొంతసేపు. మామగారు తనను కించపరచడం జ్ఞప్తికివస్తే అభిమానంవచ్చి కోపం కలుగుతోంది కొంతసేపు. అలా నిద్రలేకుండా రాత్రంతా గడిపి మర్నాడు పొద్దుట పూర్తవుతుండే... కాఫీ టిఫిను తీసుకొని అలా తన స్నేహితుడు వాసుయింటికి వెళ్లొద్దామని బయలుదేరాడు కృష్ణ.

దారిలో తన దూరబంధువు, శంకర్రావు కనబడ్డాడు. కృష్ణకు జ్ఞాపకం వచ్చింది. తనతల్లి చెప్పినశంకర్రావు యితనేనని వెంటనే శంకర్రావును ఆ విషయంలోకి దింపేడు.

"ఏమోయ్! శంకరం! ఏమిటి విశేషాలు? మొన్న తెనాలి వెళ్ళావనుకుంటాను."

"అవునండీ! మీ కెలా తెలుసు?"

"ఎలా తెలిస్తే ఏంలే! అన్నట్టు మా మామగారింటి కళ్లేవేమిటి?"

"ఆ వెళ్లేనండి."

"ఏమిటి సంగతి?"

"ఏముందండీ! ఏవో నాలుగు లోకాభిరామాయణం కబుర్లు. అంతే, అన్నట్టు! చెప్పడం మర్చిపోయాను! మీకు పండగకు రేడియో ప్రెజంటు! చూపించేరండీ మీ మామగారు నాకు ఫిలిప్సు రేడియోసెట్టు. చాలా బావుందనుకోండి! నిజంగా అలాంటి మామగారు దొరకడం మీ అదృష్టంఅండీ. మీరు ఏమీ అడగకుండానే ఆయన ఇస్తున్నారుటగా."

"అలాని ఎవరు చెప్పారు?"

"ఇంకెవరూ! నారాయణగారే నండీ! నాకలాంటి మామగారుంటే ఒక రోల్సు రాయిస్ కారు కోరి ఉండేవాణ్ణి. అవునూ! యింకా మీరు పండగకు వెళ్ళలేదేమిటి—రేపేకదండీ ఉగాది...ఆఁ!...ఏమండోయ్! కృష్ణాగారూ! ఏమిటి ఆలోచిస్తున్నారు!"

"ఆఁ! ఏమిటీ!"

"అయ్యో! వినబడలేదండీ! రేపేగదా ఉగాది యింకా బయలుదేరలేదేమిటి తెనాలి."

"యిదిగోనోయ్! యివ్వాళ బయల్దేరుతున్నాను."

"మరింక వెళ్తానుసార్"

"మంచిది". కృష్ణ తిరుగుమొహంపెట్టి యింటికి బయలుదేరాడు. తనతల్లి ప్రవర్తన తలచుకొంటే తనకే సిగ్గు కలుగుతోంది. పెద్దదై యుండి తనతల్లి అంత నీచానికి పాల్పడుతుందని కృష్ణ ఏనాడూ అనుకోలేదు. అందుకనే ఈనాటి ఈ అనుకోని సంఘటనకు తల్లడిల్లిపోయాడు. ఆధారాలు లేకుండా, తనతల్లి చెప్పిన ఒకఅబద్ధం వీలుగా తీసుకొని తన మామగారిపై తను తయారు చేసికొన్న అభిప్రాయం...ఛీ! తన మీద తనకే అసహ్యం కలిగింది. తనభార్య శారదకు కంటనీరు కల్పించిన తనప్రవర్తన తలచుకొంటే శారదపై జాలి, అభిమానం ఒక్కసారి పెల్లుబికి కన్నీటిరూపంలో బైటకివచ్చేస్తున్నాయి. అతను అలాగే అచేతనుడై, యింటికిమరలి మంచంమీద వ్రాలిపోయాడు.

ఇప్పుడు తన కర్తవ్యమేమిటి! పండగకు అత్తారింటికి వెళ్లడమా? లేక...కూడదు! తను వెళ్లితీరాలి!! శారదమనస్సుకు ఊరట కలిగించాలి. తనకోసం నిరీక్షిస్తున్న శారద తల్లిదండ్రుల్ని నిరాశపరచకూడదు.

అంతే కృష్ణ. మంచంమీదనుంచి లేచి, తొందరగా బెడ్డింగుసర్దడం మొదలుపెట్టాడు. యింక ట్రైనుకు 45 నిమిషాలు టైముంది. అతను టైముకే సామర్లకోట స్టేషనుకువచ్చి ట్రైను అందుకోగలిగాడు.

* * *

ఇంట్లోకి ప్రవేశించిన కృష్ణనుచూసి మామగారు నారాయణ, అర్థంగాక అలా చూస్తూ నిలబడి పోయారు. ఇంతట్లోనే తేరుకొని "అమ్మాయీ! శారదా!! నీళ్ళుపట్రా! అల్లుడొచ్చాడు." అని కేకవేశారు. శారదవచ్చి ఆశ్చర్యంగా గుమ్మంలోంచి తొంగిచూసి చిరునవ్వుతో లోపలికి పరుగెత్తింది నీళ్ళ కోసం. ఇంతలోకే "బావొచ్చాడు, బావొచ్చాడు" అని ఉషా, రామం పరుగెత్తుకొచ్చి కృష్ణ చెరో చెయ్యా పట్టుకొని లోపలికి నడిపించుకెళ్లారు. ఆయింట్లో గదిలోనించి రేడియోలో "వచ్చేనమ్మా! వచ్చేనే! ఉగాదిపండుగ వచ్చేనే" మధురగీతం వినవస్తోంది. పండుగ సంబరం వెల్లివిరిసిం దాయింట్లో. ★



నారసింహ లేహ్యం
బంగారుతో చేరినది. మేహము, విశ్యాశ, విష్పత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును. 20 తు డబ్బీ రు. 8-8-0, పోస్టేజి రు. 1-1-0
పి. సి. వి. అండ్ కంపెనీ ఆయుర్వేద వమాజం, పెరిడేపి (PO) నెల్లూరుజిల్లా

TONSINOL FOR TONSILS
టాన్సినాల్
గొంతు కండలకు కత్తికోతలేని మందు.
మందు సరుకులు, బుడ్లు వగైరా ధరలు విపరీతముగా పెరిగిపోయినందున 1-8-60 నుంచి ధరలు పెంచడమైనది. టాన్సినాల్ 40 రోజులకు రు. 11-25; 20 రోజులకు రు 6-25. నాష్ట్రినాల్ పెద్ద బుడ్డి 5-60; చిన్న బుడ్డి 3-12.
టాన్సినాల్ లేబరేటరీ
58, గోవిందప్పనాయకన్‌వీధి, మద్రాసు-1



పెప్స్‌ను చప్పరించి, నొప్పిని నివారించే పర్యాయ... జరుపునట్టి ఆందలి శమనకర ఆవిరులను ఆస్వాదించండి, అవి గొంతు నొప్పి, రొమ్ము పడిశెము, దగ్గు లేక బలుబునుగలిగించే క్రిములను చంపును. పెప్స్ తక్షణ నివారణను గలిగించి క్రిములను నిర్మూలించును.

ఇందులో హానికర ఓషధులు లేవు పిల్లలకు సురక్షితంగా ఇవ్వవచ్చును.
రొమ్ము పడిశెములు, గొంతు నొప్పి, పడిశెము, అధిక కఫము బిలుబులు దగ్గులను త్వరితంగా నివారించును.
మందుల వ్యాపారులందరివద్ద అమ్మబడుచున్నవి!
ఏ. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.
PPY-55-TE
సోల్ ఏజంట్లు: దాదా & కంపెనీ,
6, సైనప్ప నాయక్ వీధి, మద్రాసు-8.